JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 13-12-2025
Medchal - Malkajgiri । Saturday 13-12-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 197 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 197 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## ఉపాధి హామీ పథకం పేరు మారింది

○ పనిరోజులు 120కు పెంపు



జయభేరి, న్యూఢిల్లీ, డిసెంబర్ 12:

కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ మరో సంచలన నిర్ణయానికి తెరలేపింది. ఉపాధి హామీ పథకం పేరును మార్చేసింది. ఇప్పటివరకు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా ఉన్న పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్చుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పేరు మార్పుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో భాగంగా ఇప్పటివరకు ఉన్న పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచింది. ఇక ఉపాధి హామీ కూలీల వేతనాలను కూడా పెంచింది.

...మిగతాది 2 లో

## లొంగిపోయిన ప్రభాకరరావు



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 12:

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ప్రభాకర్ రావు పీఎస్‌లో లొంగిపోయారు. ఫిజికల్ గా టార్చర్ చేయవద్దని పోలీసులకు సుప్రీంకోర్టు ఆదేశించడం తెలిసిందే. ప్రభాకర్ రావును కొన్ని గంటలపాటు విచారించనున్నారు. అనంతరం మేజిస్ట్రేట్ ఎదుట ఎస్ఐబీ మాజీ చీఫ్ ను హాజరు పరిచారు.తెలంగాణలో గత బీఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నాయకులు, నటీనటులు, న్యాయమూర్తులు,

...మిగతాది 2 లో

## నేతల అవినీతి చిట్టా విప్పడం ఇంకా మొదలు పెట్ట లేదు

○ ఛేంజ్ ఆఫ్ ల్యాండ్స్ జీవోల మీద బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంతకం పెట్టారు

○ టాస్ మాత్రమే వేశాను.. అసలు కథ ముందుంది.. వారి బెదిరింపులకు భయపడను

○ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 12 :

ఛేంజ్ ఆఫ్ ల్యాండ్స్ జివోల మీద బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంతకం పెట్టారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. తనకు కూడా టైమ్ వస్తుందని తాను కూడా ఏదో రోజు సిఎం అవుతానని అన్నారు. బిఆర్ఎస్ నేతల అవినీతి చిట్టా విప్పడం ఇంకా మొదలు పెట్ట లేదని, బిఆర్ఎస్ నేలతపై మరోసారి ఆరోపణలు చేశారు.

...మిగతాది 2 లో



## గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డే కు భారీ సంఖ్యలో సందర్శకులు

○ ఆసక్తికరంగా ఎమర్జింగ్ టెక్నాలజీస్ అంశం పై సదస్సు

○ ఫ్యూచర్ సిటీకి విపరీతమైన క్రేజ్

జయభేరి, హైదరాబాద్, డిసెంబరు 12:

ఎమర్జింగ్ టెక్నాలజీస్ అనే థీమ్‌తో కొనసాగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఓపెన్ డే కు మూడవ రోజు శుక్రవారం నాడు వేలాది మంది తో కిటకిటలాడింది. "రియల్ లైఫ్‌లో రిజిలియెన్స్" అనే అంశంపై ప్రారంభమైన నేటి సెషన్ కు నగరంలోని పలు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు హాజరై చర్చలో పాల్గొన్నారు. ఈ చర్చలో, వేగంగా మారుతున్న టెక్నాలజీ ప్రపంచంలో రిజిలియెన్స్ యొక్క ప్రాముఖ్యత, వ్యక్తిగత, వృత్తి పరంగా ఎదురయ్యే ఒత్తిడులు, సవాళ్లను ఎదుర్కోవడం, కొత్త మార్పులకు త్వరగా అలవాటు పడే నాయకత్వ నైపుణ్యాలు, AI, ML వంటి ఆధునిక సాంకేతికతల నేపథ్యంలో భవిష్యత్ సిద్ధత, యువతలో గ్రోత్‌మైండ్‌సెట్, సమస్య పరిష్కార దృష్టికోణాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. ఈ సదస్సులో జి. సత్యనారాయణ, మాజీ చైర్మన్, UIDAI; మాజీ ఐఏఎస్, జితేంద్ర పుచ్చ, చీఫ్ డెలివరీ ఆఫీసర్, మాస్టెక్ డిజిటల్, శ్రీనివాస్ అత్రేయ, CTO, అవికా, కిషోర్ ఉప్పలపాటి, CEO, Qylis లు పాల్గొన్నారు. ఈ సెషన్‌లో ముఖ్యంగా ఆకర్షణీయమైన అంశం విద్యార్థుల అద్భుతమైన పాల్గొనడం. వేలాది మంది మధ్య జరిగిన ఈ చర్చలో విద్యార్థులు ఎంతో చురుకుగా ప్రశ్నలు అడిగారు, ప్యానెల్‌తో మమేకమయ్యారు.

ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పెస్, మూసీ రివర్ డెవలప్మెంట్, హ్యాండీక్రాఫ్ట్స్, టూరిజం, ఎడ్యుకేషన్,,కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి,చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు,డ్రోన్స్ , రోబో తదితర 27 కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు,వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, రేపు చివరి రోజైన శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సు ను సందర్శించవచ్చని ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాడు అగ్రికల్చర్, రురల్ ట్రాన్స్ఫర్మేషన్ , ఫార్మర్స్ రైసింగ్ అనే అంశంపై సదస్సు జరుగుతుందని ఆ ప్రకటనలో వెల్లడించారు. ఈ రోజు కార్యక్రమానికి దాదాపు ఆరువేలు పైగా హాజరు కాగా వీరిలో ఐదు వేళా మంది విద్యార్థులు,1000 ప్రజలు పాల్గొన్నారు.

## అధికారంలో లేకపోయినా గట్టి పోటీ

○ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఊపిరి పోసిన గ్రామ క్యాడర్

○ పంచాయితీ ఎన్నికల్లో రేవంత్ సత్తా..

జయభేరి, హైదరాబాద్, డిసెంబర్ 12 :




తెలంగాణలో జరిగిన తొలివిడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల హవా స్పష్టంగా కనిపించింది. అర్ధరాత్రి 2 గంటల వరకు వెల్లడైన ఫలితాల ప్రకారం, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు అధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఏకగ్రీవాలను కూడా కలుపుకొని కాంగ్రెస్ మద్దతుదారులు 2,383 సర్పంచ్ స్థానాల్లో విజయం సాధించారు. సిద్దిపేట జిల్లా మినహా రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను గెలుచుకుంది. ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారు సర్పంచులు కావడంతో తొలి విడత ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి తొలి గోల్ కొట్టారని కాంగ్రెస్ సంబరాలు చేసుకుంటోంది. పలు చోట్ల ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి పార్టీ గట్టిపోటీ ఇచ్చింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు తెలిపిన 1,146 మంది సర్పంచ్ అయ్యారు. బీజేపీ 200 లోపు స్థానాలు నెగ్గింది. ఈ విడతలో స్వతంత్ర అభ్యర్థులు 455 పంచాయతీల్లో విజయం సాధించగా,

...మిగతాది 2 లో

## నాలుగు కంపెనీలకు శంకుస్థాపన



○ ఈ కం పెనీల ద్వారా నగరంలోకి రూ. 282.60 కోట్ల పెట్టుబడులు

○ సుమారు 4,300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు

○ ఇటుక ఇటుక పేర్చకుంటూ వచ్చాం

○ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్

జయభేరి, విజయవాడ, డిసెంబర్ 12 :

ఆంధ్రప్రదేశ్‌కు ఐటీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో ఒకేరోజు నాలుగు ప్రముఖ ఐటీ సంస్థల ఏర్పాటుకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగానికి భారీ ఊపునిస్తూ, ప్రముఖ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ విశాఖపట్నంలో భారీ కార్యకలాపాలు ప్రారంభించనుంది. నగరంలో 20,000 సీట్ల సామర్థ్యంతో శాశ్వత క్యాంపస్‌కు భూమిపూజ చేయడంతో పాటు, తక్షణమే 1,000 సీట్లతో ఒక తాత్కాలిక టెక్ ఫిన్ సెంటర్‌ను

...మిగతాది 2 లో

## సీఎం రేవంత్ ను కలిసిన అఖిలేష్ యాదవ్




జయభేరి, హైదరాబాద్:

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిరిని సమాజ్వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, లోక్సభ సభ్యుడు అఖిలేష్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి హైదరాబాద్ వచ్చిన అఖిలేష్ యాదవ్ జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి తో కొద్దిసేపు సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## పొగరు తలకు ఎక్కకుండా చూసుకుంటా

○ తలైవా గురించి పరాశర్



జయభేరి, చెన్నై, డిసెంబర్ 12:

సూపర్ స్టార్ రజనీకాంత్ ఈరోజు తన 75వ పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భంగా, ఆయన నటించిన బాలీవుడ్ మూవీ 'చాల్‌బాజ్' (1989) చిత్రానికి దర్శకత్వం వహించిన పంకజ్ పరాశర్ ఆనాటి మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రజనీకాంత్ నటన, నిరాడంబరత, స్టార్‌డమ్ గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు."రజనీకాంత్ చాలా తెలివైన వ్యక్తి. 'చాల్‌బాజ్' శ్రీదేవి సినిమా అని ఆయన వెంటనే గ్రహించారు.

...మిగతాది 2 లో

## ఈడబ్ల్యూఎస్ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు

○ 2014-19 మధ్యకాలం ఈడబ్ల్యూఎస్ కులాలకు స్వర్ణయుగం

○ కాపుల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు పెద్దపీట

○ బ్రాహ్మణ, ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఇతర ఈబీసీ కులాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

○ త్వరలో నూతన విధానంలో విదేశీ విద్యా పథకం పునరుద్ధరణ : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

○ ఈడబ్ల్యూఎస్ చైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి సవిత ఆత్మీయ సమావేశం



జయభేరి, అమరావతి :

బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరహాలో అన్ని ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ లో కూడా క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీల ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామిక వేత్తను తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజక వర్గంలోనూ ఏర్పాటు చేయనున్నట్లు ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## అధికారంలో లేకపోయినా గట్టి పోటీ

వీటిలో సీపీఎం 14, సీపీఐ 16 చోట్లకు పైగా కైవసం చేసుకున్నాయి. చలిగాలులు వీస్తున్నప్పటికీ, ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయం ఆరు గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పంచాయతీ ఎన్నికలు జరిగాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. కొందరు వృద్ధులు అంబులెన్స్‌లో పోలింగ్ కేంద్రాలకు రాగా, పసి పిల్లలతో మహిళలు, దివ్యాంగులు సైతం పెద్ద సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. మొత్తం 53,57,277 మందికి గాను 45,15,141 మంది ఓటు వేశారు. వీరిలో అత్యధికంగా మహిళలు 23,15,796 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, పురుషులు 21,99,267, ఇతరులు 78 మంది తొలి విడత ఎన్నికల్లో ఓటు వేశారు. తొలివిడత పంచాయతీ ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో 396 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, 3,834 సర్పంచి, 27,678 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 84.28 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 92.88 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యల్పంగా 71.79 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్‌కు గట్టి పట్టున్న నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది.

**ఏ జిల్లాల్లో ఎవరిది ఆధిపత్యం..**

కొన్నిచోట్ల ఓట్ల లెక్కింపులో స్వల్ప తేడా ఉండడం రెండు, మూడుసార్లు రీకౌంటింగ్ నిర్వహించారు. దీంతో లెక్కింపు అర్ధరాత్రి దాటాకా కూడా ఓట్ల లెక్కింపు కొనసాగింది. నల్గొండ, యాదాద్రి, ఖమ్మం, ములుగు, మెదక్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, కామారెడ్డి, జనగామ, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వికారాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ మద్దతుదారులు ఎక్కువ పంచాతీయల్లో విజయం సాధించారు. సిద్దిపేట జిల్లాలో బీఆర్ఎస్ సత్తా చాటి ఎక్కువ స్థానాలు నెగ్గింది. మహబూబ్‌నగర్, వనపర్తి, హనుమకొండ, మహబూబాబాద్, భద్రాద్రి, సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టిపోటీ ఇచ్చింది. వార్డు సభ్యుల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మద్దతిచ్చిన అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో విజయం సాధించారు. మొత్తంగా చూస్తే తొలి విడత ఎన్నికల్లో బీఆర్ఎస్ కంటే రెండు రెట్ల స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్‌లుగు గెలుపొందారు

## నాలుగు కంపెనీలకు శంకుస్థాపన

ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ఈ పరిణామం రాష్ట్రప్రగతిలో ఒక కొత్త అధ్యాయమని ఆయన అభివర్ణించారు. తాజాగా దీనిపై ఆయన సోషల్ మీడియాలో స్పందించారు."ఈరోజు నాకు చాలా వ్యక్తిగతమైనది. గత 18 నెలలు అంత సులభంగా గడవలేదు... ప్రపంచ పెట్టుబడిదారులను ఒప్పించడం, నమ్మకాన్ని తిరిగి నిలబెట్టడం, ఇటుక ఇటుక పేర్చి ఆంధ్రప్రదేశ్ కథను మళ్లీ చెప్పడం వంటివి ఎంతో శ్రమతో కూడుకున్నవి. విశాఖలో 20,000 సీట్ల సామర్థ్యంతో కాగ్నిజెంట్ తన క్యాంపస్‌కు భూమిపూజ చేయడం, 1,000 సీట్ల తాత్కాలిక టెక్‌ఫిన్ కేంద్రాన్ని ప్రారంభించడంతో మనం ఒక కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్నాం. మన యువ రాష్ట్ర ప్రయాణంలో ఇది ఒక సరికొత్త అధ్యాయం, ఒక కీలకమైన మలుపు. ఇక్కడి నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ఒకేఒక్క మార్గం ఉంది... అది అభివృద్ధి పథమే" అని లోకేశ్ ఉద్ఘాటించారు. ఈ కంపెనీల ద్వారా నగరంలోకి రూ. 282.60 కోట్ల పెట్టుబడులు రానుండగా, సుమారు 4,300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. మంత్రి లోకేశ్ భూమిపూజ చేసిన సంస్థల వివరాలు ఇలా ఉన్నాయి. భీమిలి సమీపంలోని కాపులుప్పాడలో ఇమాజిన్నోవేట్ టెక్ సొల్యూషన్స్ సంస్థ రూ.140 కోట్ల పెట్టుబడితో తన క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుండగా, దీని ద్వారా అత్యధికంగా 2,600 మందికి ఉద్యోగాలు రానున్నాయి. మధురవాడ ఐటీ హిల్ 2లో టెక్ తమ్మిన సంస్థ రూ. 62 కోట్లతో ఏర్పాటు చేస్తున్న యూనిట్ ద్వారా 500 మందికి, నాన్ రెల్ టెక్నాలజీస్ సంస్థ రూ. 50.60 కోట్ల పెట్టుబడితో 567 మందికి ఉపాధి కల్పించనున్నాయి. ఇదే ప్రాంతంలో ఏసీఎన్ ఇన్ఫోటెక్ సంస్థ రూ. 30 కోట్ల పెట్టుబడితో మరో 600 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. ఈ సంస్థ 12 నెలల్లో తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ శంకుస్థాపన కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఆయా కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

**కాగ్నిజెంట్ కార్యాలయం ప్రారంభం**

ఐటీ రంగంలో విశాఖ నగరం మరో కీలక ముందడుగు వేసింది. ప్రముఖ అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థ కాగ్నిజెంట్ తన తాత్కాలిక క్యాంపస్‌ను ఇక్కడ ప్రారంభించింది. మధురవాడ హిల్ నెం 2లోని మహతి ఫిన్‌టెక్ భవనంలో వెయ్యి సీట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. కాగ్నిజెంట్ సంస్థ తన శాశ్వత క్యాంపస్ నిర్మాణం పూర్తి చేసే వరకు ఈ తాత్కాలిక కేంద్రం నుంచే కార్యకలాపాలను కొనసాగించనుంది. ఈ కేంద్రం ప్రధానంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక సేవలపై దృష్టి సారించనుంది. కార్యక్రమానికి ముందు మంత్రి లోకేశ్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి మంత్రి లోకేశ్ మాట్లాడారు. కేవలం ఏడాది వ్యవధిలోనే కాగ్నిజెంట్ సంస్థను రాష్ట్రానికి తీసుకువచ్చామని గుర్తుచేశారు. "గతేడాది జనవరి 23న సంస్థ సీఈవో రవి గారిని కలిశాను. ఇప్పుడు మీరంతా చరిత్రకు సాక్షులుగా నిలిచారు. యువతే టార్చ్ బేరర్లుగా ఉండి, కష్టపడి పనిచేసి ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో విశాఖను మరింత అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.క్క పిలుపుతో 4500 మంది కాగ్నిజెంట్ విశాఖ నుంచి సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం సంతోషమని చంద్రబాబు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆగస్ట్ కి భోగాపురం ఎయిర్ పోర్ట్ సిద్ధం అవుతోంది. 15బిలియన్లుతో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. టీసీఎస్ కూడా వస్తోందన్నారు. విశాఖ లో మిగతా నగరాలు కంటే 20 శాతం నివాస ఖర్చు తక్కువ. నెట్ జీరో కాలుష్య రహిత నగరం గా విశాఖ తీర్చి దిద్దుతామని భరోసా ఇచ్చారు. గూగుల్, కాగ్నిజెంట్ , మైక్రోసాఫ్ట్ లను నడిపించే సీఈఓ లు మన భారతీయులు తెలుగు వారు ఉన్నారన్నారు. కాగ్నిజెంట్ లక్ష ఉద్యోగాలు కల్పన చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన క్యాంపస్ 8,000 మంది ఉద్యోగులు పనిచేసేలా అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్నారు. మొత్తం రూ.1,583 కోట్ల పెట్టుబడితో 2033 నాటికి 3 దశల్లో పూర్తి కానున్న కాగ్నిజెంట్ టెక్నాలజీస్ పూర్తి కానుంది. 2026 నాటికి మొదటి దశ నిర్మాణం పూర్తి చేసుకోనుంది. అప్పటి అప్పటివరకు అద్దె కార్యాలయంలో కార్యకాలపాలు కొనసాగిస్తుంది. విశాఖ క్యాంపస్‌లో ప్రధానంగా ఏఐ, మెషీన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజినీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై కాగ్నిజెంట్ దృష్టి పెడుతుంది. ఈ కార్యక్రమంలో కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవికుమార్, ఇతర ఉన్నతాధికారులు, రాష్ట్ర మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వీఈఆర్ మాస్టర్ ప్లాన్ పై చంద్రబాబు సమీక్ష

**విశాఖపట్నం:**

ఆంధ్రప్రదేశ్లో కీలకమైన విశాఖ పట్నం ఎకనమిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 2032 నాటికి ఈ ప్రాంతాన్ని 125 నుంచి 135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. విశాఖలో వీఈఆర్ మాస్టర్ ప్లాన్ పై మంత్రులు, ఉన్నతా ధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో వీఈఆర్ పరిధిలోకి వచ్చే 9 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతిని ధులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో వీఈఆర్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రోడ్లు, రైలు మార్గాలు, పోర్టులు, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయా లకు సంబంధించి మొత్తం 49 ప్రాజెక్టుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించారు. వాణి జ్యం, పరిశ్రమలు, మున్సిపల్ పరిపాలన, పర్యాటకం, ఐటీ, వ్యవసాయం, విద్య, వైద్యారోగ్యం, నైపుణ్యాభివృద్ధి, విద్యుత్ వంటి ప్రతి రంగానికి వేర్వేరుగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ నిర్దిష్ట లక్ష్యాలతో పని చేయాలని సూచించారు.

# ఒకే ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద



దేశ ఆదాయంలో 58%.. ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది.భారత్‌లోని 40 శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతం మంది సంపన్నుల వద్ద ఉంది.భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతున్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023 నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94 శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురోగతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలు ఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం.. 2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు. నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పురోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డాయి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారు" అన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది.వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు. ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10% వర్గం సుమారు 65% సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది. ఆదాయ అసమానలతు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58% ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న 50% వర్గం వారికి దేశ ఆదాయంలో కేవలం 15% మాత్రమే దక్కుతోంది.2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్ 10% వర్గం, బాటమ్‌లోని 50% వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేళ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి.భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28000 యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7% మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది. ఇక మొత్తంగా భారతదేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలు స్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది.140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు స్థిరమైన ఆదాయంతో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వారు కేవలం 1314 కోట్ల మంది మాత్రమేనని ఈ అధ్యయనం సూచిస్తోంది. అంటే భారత మార్కెట్‌ను అర్థం చేసుకోవాలంటే కేవలంజనాభా పరంగా కాకుండా, ప్రజల ఆదాయ స్థాయిలను, ఖర్చు విధానాలను విశ్లేషించడం అవసరం. భారత్‌లో ఆర్థిక అసమతుల్యత గణనీయంగా ఉంది. నగరాల్లో ఉన్నత, మధ్య తరగతులకు మంచి ఆదాయ వృద్ధి కనిపిస్తున్నా, గ్రామీణప్రాంతాల్లో ఇంకా తక్కువ ఆదాయ స్థాయిలు కొనసాగుతున్నాయి. ఆదాయ వ్యవస్థ మెరుగుపడకపోతే వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరగదు. దేశంలో చాలా మంది అనిశ్చిత ఉపాధిపై ఆధారపడటంతో, నిర్దిష్ట ఆదాయ స్థాయిని చేరుకోవడం కష్టమవుతోంది. 100 కోట్ల మంది వినియోగదారులు వ్యక్తిగత ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వీరి ఆదాయం ప్రధానంగా ఆహారం, వైద్యం, విద్య వంటి అవసరాలకే సరిపోతోంది. విలాస వస్తువులు, గృహోపకరణాలు, వినోదం, టూరిజం వంటి విభాగాల్లో వీరు పెద్దగా ఖర్చు చేయడం లేదు. ఈ వాస్తవం మార్కెట్ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మధ్యతరగతి, ఉన్నత వర్గాలే లక్ష్యం. భారత మార్కెట్‌ను అనేక కంపెనీలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలను లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేశాయి. అయితే, వినియోగ సామర్థ్యం పరంగా చూస్తే, తక్కువ ఆదాయం గల వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఉన్నందున, మార్కెట్ వ్యూహాలను పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ప్రీమియం ఉత్పత్తులతో పాటు, బడ్జెట్ ఫ్రెండ్లీ ప్రోడక్ట్స్, స్థిరమైన ధరల వ్యూహాలు, ఫైనాన్స్ ఆధారిత వినియోగ మోడల్స్ ద్వారా ఈ వర్గాన్ని ఆకర్షించే మార్గాలను పరిశీలించాలి. భారత మార్కెట్ వృద్ధి కొనసాగాలంటే కేవలం ఉన్నత ఆదాయ వర్గాలను లక్ష్యంగా పెట్టుకోవడం సరిపోదు. తక్కువ ఆదాయ గల వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వారికి అందుబాటులో ఉండే ఉత్పత్తులు, సేవలు రూపొందించాలి. సరసమైన ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం, ఈఎంఐ లేదా ఫైనాన్స్ మోడళ్లను ప్రవేశ పెట్టడం, గ్రామీణ మార్కెట్లకు చేరువ కావడం ద్వారా వినియోగదారుల స్థాయిని విస్తరించుకోవచ్చు. డిజిటల్ విస్తరణ ద్వారా కూడా ఈ వర్గానికి మార్కెట్‌ను మరింత చేరువ చేయొచ్చు. ఈ మార్గాల్లో వ్యూహాలు అమలు చేస్తే తక్కువ ఆదాయంగల వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరిగి, భారత ఆర్థికవృద్ధికి కొత్త దిశలో ఉత్సాహం లభించవచ్చు. ఆర్థిక అసమతుల్యతను అధిగమించాలంటే ఉపాధి కల్పన సరైన పరిష్కారంగా పరిగణించాలి. ప్రజల ఆదాయాన్ని పెంచేలా.. ప్రభుత్వ కార్యక్రమాలు.. ఉద్యోగ కల్పన పెంచడం, కార్మిక వేతనాలు పెంచడంతోపాటు, స్థిరమైన ఉపాధి అవకాశాలను పెంచడం, వ్యవసాయాన్ని ఆదాయ వృద్ధి మార్గంగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ, గోదాములు, ప్రత్యక్ష మార్కెటింగ్ విధానాలు అవసరం. వినియోగదారుల మార్కెట్ విస్తరణపై దృష్టి పెట్టడం అత్యవసరం. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వృద్ధిని సాధించవచ్చు.

## ఉపాధి హామీ పథకం పేరు

ఇక పథకానికి రూ.1.51 లక్షల కోట్లను కేటాయిస్తూ.. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.దేశవ్యాప్తంగా పల్లెల్లో ఉండే పేదలకు ఉపాధి కల్పించే మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (పేరును పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ యోజనగా మార్చే నిర్ణయానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతేకాకుండా ఇప్పటివరకు ఈ పథకంలో 100 రోజుల పని దినాలు ఉండగా.. వాటిని సంవత్సరానికి 125 రోజులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పూజ్య బాపు గ్రామీణ రోజ్‌గార్ గ్యారంటీ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇక ఒక రోజుకు కూలీలకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి పెంచుతూ నిర్ణయం తీసుకుంది.ఇక ఈ పూజ్య గ్రామీణ రోజ్‌గార్ యోజన కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 1.51 లక్షల కోట్లు కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుంది. వాస్తవానికి ఈ పథకం 2005లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ1 ప్రభుత్వం.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరుతో ప్రారంభించారు. ఆ తర్వాత దానికి మహాత్మా గాంధీ పేరును జోడించారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు జీవనోపాధి భద్రతను పెంచడమే ప్రధాన లక్ష్యంగా ఈ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద గ్రామాల్లో నైపుణ్యం లేని శ్రమ చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే ప్రతీ కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో కనీసం 100 రోజుల వేతన ఉపాధికి హామీ ఇవ్వబడుతోంది.

## లొంగిపోయిన ప్రభాకరరావు

పారిశ్రామికవేత్తలతో సహా పలువురి ఫోన్లను చట్టవిరుద్ధంగా ట్యాప్ చేశారనే ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కేసు నమోదైంది. ఫోన్ ట్యాపింగ్ కేసు ప్రస్తుతం తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసింది. దర్యాప్తులో భాగంగా ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్యూరో (SIB) మాజీ అధికారులు ప్రవీణ్ రావు, నల్లమాసు శివశంకర్, మాజీ డీసీపీ రాధాకిషన్ రావు, అడిషనల్ ఎస్పీ తిరుపతన్న వంటి కీలక పోలీసు అధికారులను అరెస్ట్ చేసి విచారించారు. ఈ పోలీస్ అధికారులు తమ అధికార పరిధిని దుర్వినియోగం చేస్తూ రాజకీయ నాయకుల ఆదేశాల మేరకే ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ కేసులో అత్యంత కీలకమైన నిందితుడు, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి. ప్రభాకర్ రావుపైనే ప్రస్తుతం దర్యాప్తు కేంద్రీకృతమై ఉంది. ట్యాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే ఆయన విదేశాలకు వెళ్లిపోయారు. అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయన ఇటీవల స్వదేశానికి తిరిగి వచ్చి పలుమార్లు సిట్ విచారణకు హాజరయ్యారు. ఈ దశలో అరెస్ట్ నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించినప్పటికీ, ఆయన దర్యాప్తునకు సహకరించడం లేదని, ముఖ్యంగా డిజిటల్ సాక్ష్యాలు ఉన్న ఐక్లౌడ్ అకౌంట్ పాస్‌వర్డ్‌లు ఇవ్వడానికి నిరాకరించి, సాక్ష్యాలను ధ్వంసం చేశారని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది.నిందితుడు ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించడం లేదన్న వాదనలు, సాక్ష్యాల ధ్వంసం ఆరోపణలను పరిగణలోకి తీసుకున్న సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు కల్పించిన అరెస్ట్ రక్షణను తొలగించి, వెంటనే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ (సిట్) ఎదుట లొంగిపోవాలని ప్రభాకర్ రావును ఆదేశించింది. ప్రభాకర్ రావు లొంగిపోయిన తర్వాత ఆయనను ఫిజికల్ టార్చర్ చేయకుండా, చట్ట ప్రకారమే విచారణ చేయాలని సిట్‌ను కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం ఈ కేసు దర్యాప్తులో ఒక పెద్ద మలుపుగా పరిగణించబడుతోంది.ప్రస్తుత దర్యాప్తులో భాగంగా అరెస్టయిన అధికారులు తమ వాంగ్మూలాలలో గత సీఎంఓలోని కొంతమంది పెద్దల ప్రస్తావన తెచ్చినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్‌తో పాటు, అక్రమ నిఘా, బెదిరింపులు, ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం వంటి అభియోగాలు నమోదయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పదేళ్లుగా ఓఎస్‌డీగా పనిచేసిన పీ. రాజశేఖర్ రెడ్డి వంటి ఇతరులను కూడా సిట్ ప్రశ్నించింది. ప్రభాకర్ రావు లొంగిపోయి కస్టడీ విచారణకు సహకరిస్తే, ట్యాపింగ్ నెట్‌వర్క్ డొంక మరింత కదిలి, ఈ వ్యవహారంలో ఉన్నతస్థాయి రాజకీయ ప్రముఖుల పాత్రలు బహిర్గతమవుతాయని భావిస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్ర పోలీసుల పని తేలిక చేసింది.

## నేతల అవినీతి చిట్టా విప్పడం ఇంకా మొదలు పెట్ట లేదు

ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అవినీతిపై అరెస్టులు ఉంటాయని చెప్పి.. ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని, హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు ఎలా మాట్లాడుతారు? అని ప్రశ్నించారు. అగ్నికి ఆజ్యం పోసింది బిఆర్ఎస్ అని కవిత విమర్శించారు. తన భర్త ఫొటో చూపిస్తూ..బిజెపి పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎందుకు మాట్లాడుతున్నారని, అప్పుడే ఎందుకంత భయపడుతున్నారని నిలదీశారు టాస్ మాత్రమే వేశానని, అసలు కథ ముందుందని, వారి బెదిరింపులకు భయపడనని అన్నారు. పదేళ్లలో తాను ఒక్క రూపాయి కూడా లాభం పొందలేదని, తాను సిఎం అయితే 2014 నుంచి జరిగిన అన్ని విషయాలపై విచారణ చేయిస్తానని తెలియజేశారు. బిఆర్ఎస్ అవినీతి ప్రశ్నిస్తూ.. సిఎం రేవంత్ రెడ్డి అధికారం లోకి వచ్చారని, బిఆర్ఎస్ హయాంలో పరిశ్రమల భూమిని.. నివాస భూమిగా మార్చారని మండిపడ్డారు. పోచంపల్లి ఫామ్ హౌస్ కేసును ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని, మీరు చేసిన అక్రమాలను తనపై రుద్దొద్దని తనకు ఎవరితోనూ ఎలాంటి అండర్‌స్టాండింగ్ లేదని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ఎంతో మందిని బెదిరించి డబ్బులు తెచ్చుకున్నారని కవిత ధ్వజమెత్తారు.

## ఈడబ్ల్యూఎస్ క్రెడిట్ కో అపరేటివ్ సొసైటీల ఏర్పాటు

సామాజిక వర్గీయులకు ప్రాధాన్యమిస్తున్నామని వెల్లడించారు. అమరావతిలో రాష్ట్ర సచివాలయంలో ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో మంత్రి సవిత శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల ఆర్థిక వృద్ధికి ఆయా కార్పొరేషన్ల ఆధ్వర్యంలో చేపట్టాలని సంక్షేమ పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, ఆయా కుల సంఘాల ప్రతినిధులతో విడివిడిగా సమావేశాలు నిర్వహించి, అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కాపు, బ్రాహ్మణ, ఆర్యవైశ్య, కమ్మ, రెడ్డి, క్షత్రియ, ఇతర ఈబీసీ కులాల సాధికారితకు పలు సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈడబ్ల్యూఎస్ కులాల అభ్యున్నతే సీఎం చంద్రబాబు ప్రధాన లక్ష్యమన్నారు. వివిధ పథకాల అమలులో భాగంగా 202526 బడ్జెట్ లో ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వం రూ.10,608.61 కోట్లు కేటాయించిందన్నారు. వాటిలో ఈబీసీలకు రూ. 915.28 కోట్లు, కమ్మ కార్పొరేషన్ కు రూ.1,711.42 కోట్లు, రెడ్డి కార్పొరేషన్ కు రూ.1,946.36 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్ కు రూ.260.20 కోట్లు, కాపు కార్పొరేషన్ కు రూ.4,884.83 కోట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ కు రూ.545.05 కోట్లు. బ్రాహ్మణ కార్పొరేషన్ కు రూ.345.46 కోట్లు కేటాయించామన్నారు.

## తలకు ఎక్కకుండా చూసుకుంటా

తాను ఎప్పటిలా సూపర్ హీరో తరహా పాత్ర చేస్తే అది పనిచేయదని భావించి, తన పాత్రను కామెడీగా మార్చుకున్నారు. భయపడే వ్యక్తిగా నటించడానికి ఒప్పుకున్నారు, ఇది చాలా మంది స్టార్ హీరోలు చేయరు. ఆయన ఇంప్రూవైజేషన్ అద్భుతం" అని పరాశర్ తెలిపారు. సెట్‌లో శ్రీదేవి రాగానే రజనీకాంత్ సరదాగా వంగి నమస్కరిస్తూ 'శ్రీదేవా' అని పిలిచేవారని గుర్తుచేసుకున్నారు.రజనీకాంత్ నిరాడంబరత తనను ఆశ్చర్యపరిచిందని పరాశర్ చెప్పారు. "ఆయనకు అసిస్టెంట్, మేనేజర్ ఎవరూ ఉండేవారు కాదు. తన పాత 1960ల నాటి ఫియట్ కారును స్వయంగా నడుపుకుంటూ వచ్చేవారు. ఒకరోజు నన్ను హోటల్‌లో డ్రాప్ చేస్తానని ఆఫర్ ఇచ్చారు. కారులో ఏసీ పనిచేయకపోవడంతో నేను కిటికీ అద్దం దించబోయాను. జనం చూస్తే గొడవ (గలాటా) అవుతుందని వద్దన్నారు. నేను నమ్మలేదు. ఒక సిగ్నల్ దగ్గర ఇద్దరు వ్యక్తులు 'తలైవా' అని అరవడంతో క్షణాల్లో జనం పోగైపోయి ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు రావాల్సి వచ్చింది. అప్పుడే ఆయన స్టార్‌డమ్ ఏంటో నాకు తెలిసింది" అని వివరించారు.అంతటి స్టార్‌డమ్ ఉన్నప్పటికీ, గర్వం రాకుండా ఉండేందుకు రజనీకాంత్ తీసుకునే జాగ్రత్తల గురించి కూడా పరాశర్ మాట్లాడారు. "ప్రజలు నన్ను పూజిస్తారు, అది తలకెక్కే ప్రమాదం ఉంది. అందుకే నేను పర్వతాలకు వెళ్లి, ఒక గుడిలో 1012 రోజులు ఉండి, నేల శుభ్రం చేసి, కిందనే పడుకుంటాను. ఇది నన్ను వినయంగా ఉంచుతుంది" అని రజనీకాంత్ తనతో చెప్పినట్లు పరాశర్ గుర్తుచేసుకున్నారు. తన 50 ఏళ్ల సినీ ప్రస్థానానికి గుర్తుగా ఇటీవలే రజనీకాంత్ గోవాలో జరిగిన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జీవిత సాఫల్య పురస్కారం అందుకున్న విషయం తెలిసిందే.

**హ్యాపీ బర్తడే మై ఫ్రెండ్**

సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తన ప్రియ మిత్రుడికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సామాజిక మాధ్యమాల్లో ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. రజనీకాంత్ వ్యక్తిత్వాన్ని, ఆయన ప్రయాణాన్ని చంద్రబాబు కొనియాడారు."నా ప్రియ మిత్రుడు, లెజెండరీ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు! తెరపై, నిజ జీవితంలో హీరోలుగా ప్రకాశించే అతి కొద్ది మందిలో ఆయన ఒకరు. ఆయన వ్యక్తిగత ప్రయాణం కూడా అసాధారణమైన సినిమా ప్రయాణం అంతే స్ఫూర్తిదాయకం. ఆయనకు ఈ రోజు మరెన్నో సంతోషాలను ఇవ్వాలని కోరుకుంటున్నాను. నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షిస్తున్నాను!" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు, రజనీకాంత్ మధ్య దశాబ్దాలుగా బలమైన స్నేహబంధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. గతంలో అనేక బహిరంగ సభల్లో ఇరువురూ తమ స్నేహాన్ని, ఒకరిపై ఒకరికి ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. చంద్రబాబు లాంటి రాజకీయ నాయకుడు చాలా అరుదని రజనీకాంత్ పలు సందర్భాల్లో ప్రశంసించగా, రజనీకాంత్ వ్యక్తిత్వాన్ని చంద్రబాబు కూడా ఎన్నోసార్లు కొనియాడారు. ఈ నేపథ్యంలో రజనీ పుట్టినరోజున చంద్రబాబు చేసిన పోస్ట్ వారి స్నేహానికి నిదర్శనంగా నిలిచింది.

# భారీ కార్పొరేషన్ వల్ల పౌర సేవలకు తీవ్ర ఇబ్బందులు వస్తాయి

○ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

జయభేరి, మేడిపల్లి :





హైదరాబాద్ GHMC విస్తరణపై విడుదలైన డ్రాఫ్ట్ గెజిట్‌కు నగర శివారు ప్రాంతాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ముఖ్యంగా 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని 598 వార్డులను కేవలం 53 డివిజన్లుగా కుదించే ప్రతిపాదనపై స్థానిక ప్రజా ప్రతినిధులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.
GHMC విస్తరణ ప్రక్రియలో భాగంగా జరిగిన తాజా వార్డుల పునర్విభజన స్థానిక ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా, పూర్తిగా అశాస్త్రీయమని అభ్యంతరం తెలియజేస్తూ వార్డుల పునర్విభజనను న్యాయంగా, పారదర్శకంగా, స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మళ్ళీ సమీక్షించవలసిందిగా పీర్జాదిగూడ సర్కిల్‌లో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కలిసి డిప్యూటీ కమీషనర్ త్రిలేశ్వర్ రావుకి వినతి పత్రం అందజేశారు.
మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ విస్తరణ, అభివృద్ధి ఇవి పరిపాలనా వికేంద్రీకరణతోనే సాధ్యమయ్యాయి. కేసీఆర్ ప్రభుత్వం చేసిన కొత్త జిల్లాలు, రేవెన్యూ విభాగాలు, మున్సిపాలిటీలు వంటి సంస్కరణలు నగర గ్రోత్‌ను మరింత వేగవంతం చేశాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయం ప్రజా ప్రయోజనాల కాదు... అధికార కేంద్రీకరణ దిశగా తీసుకెళ్తోంది. GHMCని 300 వార్డులతో భారీ కార్పొరేషన్‌గా విస్తరించడం వల్ల పౌర సేవలు సకాలంలో చేరడంలో తీవ్ర ఇబ్బందులు వస్తాయి.
స్థానిక ప్రతినిధ్యం తగ్గిపోతుంది, అభివృద్ధి పనులు నెమ్మదిస్తాయి, రాబోయే దశాబ్దంలో జనాభా పెరుగుదల నిర్వహణ కష్టతరం అవుతుంది.
మౌలిక సదుపాయాల ప్రణాళికలు కూడా దెబ్బతింటాయి. మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు GHMCను 1. హైదరాబాద్ ఈస్ట్, 2. హైదరాబాద్ వెస్ట్, 3. హైదరాబాద్ నార్త్, 4. హైదరాబాద్ సెంట్రల్ / సౌత్ నాలుగు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజించాలని డిమాండ్ చేశారు. ప్రజా అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి, నగర విస్తరణ ఆధారంగా GHMC రీడిజైన్ చేయాలని, డ్రాఫ్ట్ గెజిట్‌ను వెంటనే పునఃపరిశీలించాలని నేతలు స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, యూత్ అధ్యక్షులు ప్రభ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల అవగాహన కార్యక్రమం

జయభేరి, మెడిపల్లి :



తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల మేరకు, శుక్రవారం మధ్యాహ్నం 02:00 గంటలకు, మెడిపల్లి పోలీసులు జామ మసిజ్, నరాపల్లీలో సుమారు 200 మంది నరపల్లి ముస్లిం వాసులతో సైబర్ నేరాల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి నరపల్లీ మెయిన్ రోడ్ పైన ర్యాలిని నిర్వహించడం. ఆరు వారాల కార్యక్రమంలో రెండవ వారంలో 'Scam Se Bacho' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ భద్రత, మోసాలు జరిగిన వెంటనే తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించబడింది.
1) పోలీస్, సైబర్ క్రైమ్ లేదా కోర్ట్ పేరుతో వచ్చే ఫోన్ కాల్స్/WhatsApp వీడియో కాల్స్‌ను కాలేజ్ స్టూడెంట్స్ అసలు నమ్మకూడదు. గుర్తు తెలియని వ్యక్తులు "మీ మీద కేసు ఉంది", "మీ Aadhaar/Bank misuse అయింది" అంటూ బెదిరించడం డిజిటల్ అరెస్ట్ స్కామ్ లక్షణాలు. 2) ఏ విచారణకైనా పోలీసులు కాలేజ్ స్టూడెంట్స్‌ను ఫోన్ ద్వారా 'అరెస్ట్' చేయరు; అలాగే ఎటువంటి చెల్లింపులు, OTPలు, బ్యాంక్ వివరాలు కోరరు. అలాంటివి ఎదురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి లేదా కాలేజ్ సైబర్ సెల్/పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
3) సోషల్ మీడియా ఫ్రెండ్ రిక్వెస్టులు, వీడియో కాల్స్ విషయంలో జాగ్రత్త, కాలేజ్ విద్యార్థులు అనేక కొత్త పరిచయాలు చేసుకుంటారు. అజ్ఞాత వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు అంగీకరించడం, ప్రైవేట్ వీడియో కాల్స్ చేయడం, వ్యక్తిగత ఫోటోలు పంపడం వంటి చర్యలు సెక్స్టార్షన్‌కు అవకాశం ఇస్తాయి. కాబట్టి ప్రైవేట్ కంటెంట్ ఆన్‌లైన్‌లో ఎప్పుడూ షేర్ చేయవద్దు. 4) గుర్తు లేని లింకులు, యాప్స్‌ను ఓపెన్ చేయకూడదు, ఫ్రీ రీఛార్జ్, స్కాలర్‌షిప్, రివార్డ్స్ అంటూ వచ్చే లింకులు, యాప్స్, APK ఫైళ్లలో స్పైవేర్ ఉండే అవకాశం ఉంది. ఇవి ఫోన్ కెమెరా, గ్యాలరీ, కాంటాక్ట్‌స్‌కి యాక్సెస్ తీసుకుని బ్లాక్‌మెయిల్ చేయడానికి దారితీస్తాయి. 5) ఆన్‌లైన్‌లో కొత్త ఫ్రెండ్ అయ్యారన్న కారణంగా వెంటనే వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు, లేదా ప్రైవేట్ వివరాలు షేర్ చేయొద్దు. నమ్మకం వచ్చిన తరువాత కూడా జాగ్రత్తగా వ్యవహరించండి. 6) సోషల్ మీడియా, Instagram, Snapchat, WhatsApp వంటి ప్లాట్‌ఫామ్‌లలో అపరిచితుల వీడియో కాల్స్, అనుమానాస్పద లింకులు, ఫేక్ అకౌంట్లను దూరంగా ఉంచండి; ఏదైనా బ్లాక్‌మెయిలింగ్ ప్రయత్నం కనిపిస్తే వెంటనే కాలేజ్ యాజమాన్యం లేదా సైబర్ హెల్ప్‌లైన్‌కు తెలియజేయండి.
7) ఆన్‌లైన్‌లో వచ్చే "హై పేమెంట్ పార్ట్‌టైమ్ జాబ్స్", "వర్క్ ఫ్రామ్ అబ్రాడ్" ఆఫర్లను నమ్మి మీ పాస్‌పోర్టు, ఐడీ ప్రూఫ్‌లు ఎవరికీ పంపకండి. కాలేజ్ స్టూడెంట్లు లక్ష్యంగా చేసే ఫేక్ రిక్రూట్మెంట్ స్కామ్‌ల నుండి జాగ్రత్తగా ఉండాలి. 8) ఫ్రెండ్స్, సోషల్ మీడియా కాంటాక్ట్స్ ద్వారా వచ్చే ట్రావెల్ ఆఫర్లు లేదా అన్‌నోన్ కంపెనీ ఇంటర్వ్యూ కాల్‌స్‌కు వెంటనే స్పందించకండి. మీ పేరుతో లోన్‌లు, అకౌంట్‌లు ఓపెన్ చేసే ప్రమాదం ఉంటుంది కాబట్టి వివరాలు ఇవ్వకండి. చివరగా, మెడిపల్లి పోలీసులు ఆధ్వర్యంలో జామ మసిజ్ నరపల్లి ముస్లిం వాసులతో ఆన్‌లైన్‌లో జాగ్రత్తగా ఉండాలని, అనుమానాస్పదమైన సైబర్ కార్యకలాపాలను వెంటనే రిపోర్ట్ చేయాలని, తమ కుటుంబ సభ్యులు-స్నేహితులకు కూడా ఇదే అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.



# క్యాన్సర్‌తో పోరాడుతున్న నటి..

○ సాయం చేయాలంటూ కరాటే కళ్యాణి రిక్వెస్ట్

జయభేరి, హైదరాబాద్ డిసెంబర్ 12

;టాలీవుడ్‌లో సహాయ నటిగా ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న వాహిని అలియాస్ పద్మక్క ప్రస్తుతం తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పోరాడుతూ ఐసీయూలో చికిత్స పొందుతున్న వార్త పరిశ్రమలో కలకలం రేపుతోంది. 1978లో జన్మించిన వాహిని, టెలివిజన్ ప్రేక్షకులకు 'జయ వాహిని' పేరుతో బాగా దగ్గరైంది. చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె అనేక తెలుగు, తమిళ సినిమాలు, టీవీ సీరియల్స్‌లో సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సినిమాల కంటే టీవీ సీరియల్స్‌లో ఆమె ప్రయాణం మరింత బలంగా కొనసాగింది. జెమిని, ఈటీవీ వంటి ప్రముఖ చానెల్స్‌లో ప్రసారమైన అనేక సీరియల్స్‌లో నటిస్తూ మంచి గుర్తింపు సంపాదించారు. ఇటీవల ఆమె 'బహిర్భూమి' అనే సినిమాలో కూడా కనిపించారు.అయితే, ఈ టాలెంటెడ్ నటి ప్రస్తుతం రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గత కొన్ని నెలలుగా చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి క్షీణించడంతో అవయవాల పనితీరులో లోపాలు కనిపించి ప్రస్తుతం ఐసీయూలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. వైద్యుల ప్రకారం, వాహినికి జరుగుతున్న నిరంతర చికిత్స, కీమోథెరపీ, శస్త్రచికిత్సలు, ఐసీయూ కేర్ కోసం ₹25 లక్షల నుంచి ₹35 లక్షల మధ్య ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే సినీనటి కరాటే కళ్యాణి సోషల్ మీడియాలో భావోద్వేగంతో చేసిన పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షించింది. వాహిని తమ చిన్ననాటి స్నేహితురాలని, విజయనగరం లో మా ఇళ్లు పక్కపక్కనే ఉండేవని గుర్తుచేసుకున్న కల్యాణి, ఇప్పుడు జీవన్మరణ పోరులో ఉన్న వాహినికి పరిశ్రమ, అభిమానులు తప్పకుండా చేయూత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.అలాగే వాహినికి సంబంధించిన ఫోన్‌పే, గూగుల్ పే నంబర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు కూడా షేర్ చేస్తూ ఆమెను కాపాడేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. కరాటే కళ్యాణి పోస్ట్ వైరల్ కావడంతో, హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. అనేక మంది ఆమెకు ఆర్థిక సహాయం చేస్తూ పంపిన స్క్రీన్‌షాట్లను పంచుకుంటున్నారు. తెరపై చిరునవ్వుతో, సహజమైన నటనతో అందరిని అలరించిన వాహిని నిజజీవితంలో ఆరోగ్యంతో మళ్లీ తిరిగిరావాలని సినీ ప్రముఖులు, అభిమానులు కోరుకుంటున్నారు.

# లింగారెడ్డి గూడాలో చక్రం తిప్పిన అశోక్

○ వార్డు మెంబర్ గా గెలిచి ఉప సర్పంచ్ పదవికి ఎన్నికైన అశోక్
○ ఆశీర్వదించిన ఎమ్మెల్యే శంకర్
○ ఎమ్మెల్యే ఆశీస్సులతో ఘన విజయం


జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 12 :



పంచాయతీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డి గూడా గ్రామంలో వార్డు మెంబర్ గా పోటీ చేసిన కాంగ్రెస్ యువనేత అశోక్ ఘన విజయం సాధించారు. ఇదే తరుణంలో గ్రామ సర్పంచ్ అభ్యర్థికి పూర్తి స్థాయిలో సహకారం అందించి అతని గెలుపుకు కృషి చేశాడు. తాను కూడా వార్డు సభ్యుడిగా విజయం సాధించి ప్రస్తుతం పల్లె ద్వితీయ పౌరుడిగా ఎన్నికయ్యాడు.

## ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు అశోక్ ప్రస్థానం

మొదటినుంచి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు అన్ని విధాలా అండగా ఉంటూ నాయకుడిగా తనదైన ముద్ర వేసిన లింగారెడ్డిగూడెం అశోక్ సర్పంచిగా పోటీ చేయాలని ఆలోచించినప్పటికీ గ్రామంలో రిజర్వేషన్ కేటగిరీ కింద ఆ స్థానం ఎస్సీలకు వెళ్లడంతో వార్డు సభ్యుడిగా పోటీ చేశాడు. అభ్యర్థి ఎంసీ రాజుకు అన్ని విధాల సహకరించి అతని గెలుపుకు కృషి చేయడమే కాకుండా వార్డు సభ్యుడిగా విజయం సాధించి భేష్ అనిపించుకున్నాడు. గ్రామ సర్పంచ్ విజయం కోసం చిత్తశుద్ధితో శ్రమించిన అశోకుడిని డిప్యూటీ సర్పంచిగా వార్డు సభ్యులు ఏకగ్రీవంగా బలపరిచారు. దీనితో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు.



## గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటా...

లింగారెడ్డిగూడెం గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా లింగారెడ్డిగూడెం గ్రామ ఉప సర్పంచ్ "లింగారెడ్డిగూడెం అశోక్" అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులు తనకు ఉన్నాయని, ఆయన అండతో, సర్పంచ్ పిసి రాజుకు అండగా ఉంటూ గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. తనను ఓటు వేసి గెలిపించిన గ్రామ ఓటర్లు, అదేవిధంగా ఉపసర్పంచ్ కావడానికి తనకు మద్దతు ఇచ్చిన వార్డు సభ్యులందరికీ, గ్రామ పెద్దలు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చెల్లా శ్రీకాంత్ రెడ్డి తదితర మిత్ర బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన ఉన్నతికి మొదటి నుంచి సహకరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ఆయన మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

# జీతాలు పెంచాలని మహిళా కార్మికుల ధర్నా

జయభేరి, మేడ్చల్:

నాచారం పారిశ్రామిక వాడలో ఉన్న షాహి ఎక్స్పోర్ట్స్ గార్మెంట్ సంస్థలో పని చేస్తున్న మహిళా కార్మికులు తమకు జీతాలు పెంచాలని చేస్తున్న ధర్నా కార్యక్రమం నేటికి 5వ రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరించి పరిశ్రమ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా కార్మికులకు సీపీఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నారాయణ ధర్నాలో పాల్గొని కార్మికులకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 4 రోజులగా మహిళా కార్మికులు ఎండలో కూర్చొని తమకు న్యాయం చేయాలని ధర్నా చేస్తున్న యాజమాన్యం స్పందించకపోవడం సరికాదన్నారు. కంపెనీలో పని చేస్తున్న మహిళలకు కనీసం గౌరవం ఇవ్వకుండా అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అలా ప్రవర్తించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్.



# గవర్నమెంట్ స్కూల్ లో ఫుడ్ పాయిజన్

జయభేరి, హైదరాబాద్ :

మాదాపూర్ చందు నాయక్ తాండా లోని గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ జరిగింది. మొత్తం 43 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఆరుగురు విద్యార్థులకు నానక్ రామ్ గూడ లోని రెయిన్ బో హాస్పిటల్ లో చికిత్స జరిపిస్తున్నారు. మిగతా విద్యార్థులను కొండాపూర్ ఏరియా హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు. మధ్యాహ్నం లంచ్ తిన్న తరువాత విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

# మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ సన్మాన కార్యక్రమం



జయభేరి, మేడిపల్లి :

హైదరాబాద్‌లో మాజీ ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్. సమాజ్‌వాదీ పార్టీ అధినేత, మాజీ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ శుక్రవారం హైదరాబాద్‌కు వ్యక్తిగత కార్యక్రమ నిమిత్తం విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదర్శ్‌నగర్, న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన అఖిలేష్ యాదవ్ ముఖ్యంగా సదర్ పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని హర్షిస్తూ, ఇది రాష్ట్ర సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే మంచి నిర్ణయమని అన్నారు.

# మర్యాదపూర్వకంగా కలిసిన నూతనంగా ఎన్నికైన సర్పంచ్

○ జూబ్లీనగర్ గ్రామ సర్పంచ్ మూలగుండ్ల లావణ్య శ్రీనివాస్ రెడ్డి



జయభేరి, రేగొండ :

గురువారం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన రేగొండ మండలం జూబ్లీనగర్ గ్రామ సర్పంచ్ మూలగుండ్ల లావణ్య శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు భారీ మెజారిటీతో గెలుపొందిన శుభసందర్భంగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వారికీ శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపి.. ప్రజలు మీ మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దు అని ప్రజల కష్టనష్టాలో అండగా ఉండాలని కోరారు.

# సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చెయ్యండి

○ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపు



జయభేరి, పరవాడ:

విశాఖపట్నంలో 2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు జరుగు సిఐటియు జాతీయ మహాసభ లను జయప్రదంకై పరవాడ సినిమా హాల్ జంక్షన్లో లో ప్రచారం చేయడం నిధి సమీకరించారు.ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లాడుతూ చారిత్రాత్మకమైన విశాఖపట్నంలో మొదటిసారిగా సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్నవని 2026 జనవరి 4న ఆర్కే బీచ్ లో జరుగు బహిరంగ సభకు కేరళ ముఖ్యమంత్రి పినరాయ్ విజయన్ పాల్గొంటారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు కార్మికుల హక్కులు పై దాడి చేస్తున్నరు పని గంటలు పెంచి అమలు చేస్తున్నవని రాష్ట్రంలో సుమారు 50 లక్షల మంది షెడ్యూల్ పరిశ్రమల కార్మికులు గత 12 సంవత్సరాలుగా కనీస వేతనాలు పెంపదలకు నోచుకోకుండా ఉన్నారని అన్నారు.కూటమి ప్రభుత్వాలు భవనిర్మాణ సంక్షేమ చట్టాలు అమలు చేయడంలో ఏమాత్రం కూడా బాధ్యతగా లేవని సంక్షేమ బోర్డులో వేలకోట్ల రూపాయలను ప్రభుత్వ అవసరాలకు వాడుకొని కార్మికులను ఇబ్బంది పాలు చేస్తున్నాయని అన్నారు.భవిష్యత్తులో ఈ విధానాలకు వ్యతిరేకంగా జరుగు దేశ వ్యాప్త కార్మిక ఉద్యమాలకు ఈ మహాసభలు నాంది కానున్నాయని అన్నారు. ఈ మహాసభలు జయప్రదం చేయుటకు జిల్లాల్లో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం, అన్నపూర్ణ, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసిటీలో జోనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన జిల్లా ఎస్పీ

- ఎంఎఎస్ఆర్ఎం వారిచే బొలెరో వాహనం అందజేత

✍ జయభేరి, పరవాడ:





అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం పరవాడ జవహర్ లాల్ ఫార్మసిటీలో ఎంఎఎస్ఆర్ఎం వారి భవనంలో అత్యాధునిక జోనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ను ప్రారంభించారు. ఫార్మా కంపెనీలలో ప్రమాదాలను సమన్వయంతో నివారించడానికి, అత్యవసర సమయాల్లో సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ వినూత్న వ్యవస్థను ఏర్పాటు చేశారు.
ఈ కేంద్రం ద్వారా ఫైర్ బ్రిగేడ్, అంబులెన్సులు, క్రేన్స్, మరియు పోలీస్ బందోబస్తు వాహనాలు వంటి అత్యవసర సేవలు రియల్ టైమ్ పర్యవేక్షణలో ఉంటాయి. ఈ సందర్భంగా నిర్వహించిన గ్యాస్ లీకేజీ మాక్ డ్రిల్ విజయవంతమైంది. సమాచార పంపిణీ, ఇన్సిడెంట్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు, ఫైర్ బ్రిగేడ్ రాక, గ్యాస్ న్యూట్రలైజేషన్, క్షతగాత్రుల తరలింపు మరియు ఉద్యోగుల ఎవాక్యుయేషన్ వంటి అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే పరిశ్రమలు స్పష్టమైన సమాచారాన్ని అందిస్తే, ఫ్యాక్టరీస్ మరియు పోలీస్ శాఖల ద్వారా నిజమైన సమాచారం ప్రజలకు చేరి,అనవసర భయాందోళనలు కలగకుండా చూడవచ్చని తెలిపారు.
ఫార్మాసిటీలో పనిచేస్తున్న మైగ్రెంట్ లేబర్ వివరాలను పరిశ్రమలు సక్రమంగా నమోదు చేసుకోవాలని, అవసరమైతే పోలీస్ సహాయంతో బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్ చేపట్టాలని ఆదేశించారు.ఇండస్ట్రీ ప్రతినిధులు కోరిన ట్రాఫిక్, పెట్రోలింగ్ సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.శాంతి భద్రల పరిరక్షణలో భాగంగా, జిల్లా పోలీసులకు పెట్రోలింగ్ విధులు నిర్వహించేందుకు మ్యుట్యుయల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మీటిగేషన్ వారు వితరణగా ఒక బొలెరో వాహనాన్ని అందజేశారు. ఈ వాహనాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. పోలీసుల పనితీరుకు సహకారం అందించినందుకు ఎంఎఎస్ఆర్ఎం ప్రతినిధులను ఎస్పీ అభినందించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జె.శివశంకర్ రెడ్డి, బాయిలర్ ఇన్స్పెక్టర్ వీరభద్ర రావు, జైఎన్పిసిఎం వైస్ ప్రెసిడెంట్ ఎన్.సూర్యప్రకాశ్ రావు, సెక్రటరీ జెట్టి సుబ్బారావు, విశాఖ ఫార్మాసిటీ ఎండీ డా. పి.పి.లాల్‌కృష్ణ, లారస్ లాబ్స్ ఎచ్ ఆర్ వైస్ ప్రెసిడెంట్ బి రామకృష్ణ, పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్, పరవాడ సీఐ ఆర్. మల్లికార్జున రావు,అచ్యుతాపురం సీఐ చంద్రశేఖర్, రాంబిల్లి సీఐ నర్సింగరావు, మరియు ఎంఎస్ఆర్ఎం ప్రతినిధి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.



## అందుల ఆశ్రమ పాఠశాలకు దాతలు ఆర్థిక సహాయం

✍ జయభేరి, పరవాడ:

పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 95 వార్డ్ పరిధి లక్ష్మీపురంలో ఉన్న అందుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు కొరకు చిట్టిబోయిన కోటేశ్వరరావు తన సొంత ఖర్చులుతో రెండు నెలలకు సరిపడా ఆశ్రమ పాఠశాలకు రేషన్ సరుకులు ఇవ్వడంజరిగింది అదే విధంగా ఆకాష్ ఆర్థిక సహాయంతో విద్యార్థులకు ఇబ్బంది కల్గకుండా ఒక సీలింగ్ ఫ్యాన్ను కూడా ఆశ్రమ పాఠశాలకు ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన ఇచ్చే సహాయం నలుగురికి ఇబ్బందిని ఆకలిని తీర్చే విధంగా ఉండాలని ఇలాంటి సహాయాలు వలన తమకు ఎంతో హాయిని కల్గిస్తుందని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్టీల్ ప్లాంట్ ఇటక్ కార్మిక నాయకుడు మంత్రి గిరిప్రసాద్, దాసరి ప్రకాష్, కాకి రాము ఆశ్రమ పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 50.83 శాతం ఉత్తీర్ణత



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ దేవరకొండలో 2025 26 విద్యాసంవత్సరానికి సంబంధించిన మొదటి సెమిస్టర్ ఫలితాలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మహాత్మా గాంధీ యూనివర్సిటీ నల్గొండ జి.ఉపేందర్ రెడ్డి చేత అధికారికంగా ఫలితాల అప్రూవల్ తీసుకుని ఫలితాలను విడుదల చేసి ఆ ఫలితాలను కళాశాల వెబ్ సైట్ ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. కళాశాల మొత్తంగా 50.83% శాతం ఉత్తీర్ణత పొందారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. రమావత్ రవి మాట్లాడుతూ పరీక్షల నిర్వహణ విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా యూనివర్సిటీ స్థాయిలో చాలా పటిష్టంగా పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి. కోటయ్య, అకాడమిక్ కోఆర్డినేటర్ సి.లింగమయ్య కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి తదితర అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సర్పంచ్ ను సన్మానించిన శాసనసభ్యులు బాలు నాయక్



✍ జయభేరి, చందపేట :

చందంపేట మండలం మూర్పునుంతల గ్రామపంచాయతీ గ్రామస్తుల సమక్షంలో లోకసాని దామోదర్ మన్మధరెడ్డి వారు గ్రామానికి చేసిన సేవలకు గాను ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా సర్పంచ్ గా ఎన్నుకోవడం జరిగింది వారు మాట్లాడుతూ తన గ్రామంలో జన్మించిన ప్రతి ఆడపిల్లలకు తన వంతుగా పోస్ట్ ఆఫీస్ లో తన సొంత ఖర్చులతో సుకన్య యోజన సమృద్ధి పథకం కాతాను తన సొంత ఖర్చులతో ఇస్తానని అదే విధంగా ప్రయివేట్ పాఠశాలకు ధీటుక ప్రభుత్వ పాఠశాలలో అందరు విద్యార్థులకు కావలసిన కానీస అవసరాలు చేస్తామనీ గ్రామం తనకి ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తు ప్రతి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని తన ఏకగ్రీవ సర్పంచు పదవి తనకు ఇప్పిచ్చినందుకు శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేసినారు అదేవిధంగా గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

## ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ సంతోషిమాత కాలనీ 17వ వార్డులో గరుడాద్రి దేవాలయం ప్రక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సంతోషిమాత కాలనీవాసులు కమిషనర్ కార్యాలయంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వస్కుల సుధాకర్, చిత్రం ఏసేపు, అంకురి పెద్ద మల్లయ్య, పొట్ట రత్నయ్య, అంకురి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ గా నత్తి శివరాములు ఘన విజయం

- సన్మానించిన మాదాసి మాదారి కురుమ సంఘం నాయకులు

✍ జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 12 :

మదాసి మదారి కురువ సంఘం తాలూకా షాద్ నగర్ ఆధ్వర్యంలో రాసుమల్లగూడ సర్పంచ్ నత్తి శివ రాములుకు సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు మాట్లాడుతూ; కురువ కులస్తులు అన్ని రంగాలలో ఎదగాలని అన్నారు. ఆర్థికంగా ముందుండాలని ఉన్నత పదవుల్లో ప్రతి ఒక్కరూ రాణించాలని అన్నారు. ఎంత ఉత్సాహంతో ఓటర్లు గెలిపించారో అంతే ఉత్సాహంతో ఆ గ్రామ ప్రజలందరికీ అన్నివేళల అండగా ఉండి అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసి మంచి పేరు ప్రతిష్టలు పొందాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బండ వెంకటేష్, జిల్లా అధ్యక్షులు సిందం విఠలయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొరికి అర్జున్, మీడియా కన్వీనర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మాయమాటలు చెప్పి యువతిపై ముగ్గురు వేర్వేరు ప్రదేశాలలో అత్యాచారం



✍ జయభేరి, అమరావతి, డిసెంబర్ 12:

మాయమాటలు చెప్పి యువతిపై ముగ్గురు వేర్వేరు ప్రదేశాలలో అత్యాచారం చేసిన సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రిలోని ఓ గ్రామానికి చెందిన యువతి అనంతపురంలో డిప్లొమో సెకండ్ ఇయర్ చదువుతోంది. సొంత గ్రామం నుంచి అనంతపురం పోయే వచ్చేది. ఆటో డ్రైవర్ గురుమోహన్ పరిచయం కావడంతో మాయమాటలతో ఆమెను ప్రేమలోకి దించాడు. డిసెంబర్ 2న కాలేజీకి తీసుకెళ్తానని చెప్పి ఆటోలో తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి తీసుకెళ్తానని చెప్పి యువతిని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఆమెపై అక్కడ బలవంతంగా అత్యాచారం చేసి మరుసటి రోజు సొంతూరుకు బస్సు ఎక్కించాడు. తాడిపత్రి చేరుకున్న తరువాత బస్సులో తెలిసిన యువకుడు ప్రదీప్ పరిచయం కావడంతో భయంతో అతడి వద్దకు వెళ్లింది. దీనిని అసరాగా తీసుకొని కడపలోని తన ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను తిరుపతి బస్సు ఎక్కించాడు. కాలేజీలో పరిచయమైన బ్రహ్మానాయుడుకు ఫోన్ చేయడంతో ఆమెను ఓదార్చి తన ఇంటికి యువతిని తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై మూడు రోజులు అత్యాచారం చేశాడు. బాధితురాలు బ్రహ్మానాయుడు నుంచి తప్పించుకొని ఇంటికి వెళ్లింది. జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. అప్పటికే తల్లిదండ్రులు తన కూతురు కనిపించడంలేదని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## ఆకట్టుకొన్న చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

- కనకమహాలక్ష్మి సన్నిధిలో ప్రసన్న కూచిపూడి నాట్యశాల నృత్య ప్రదర్శన

✍ జయభేరి, పరవాడ:





ఉత్తరాంధ్ర ప్రజల కల్పతరువు, కోరిన కోర్కెలు తీర్చే కలపవల్లి, భక్తుల పాలిట కొంగు బంగారం విశాఖపట్నంలో గల కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం కళావేదికపై గత కొద్ది రోజులు క్రితం పరవాడ సినిమాలు జంక్షన్ సంతోషిమాత ఆలయం వద్ద గల ప్రసన్న కూచిపూడి నాట్య శాల చిన్నారుల నృత్య ప్రదర్శన అదరహో అనిపించింది.అమ్మవారి మార్గశిర మాసోత్సవం సందర్భంగా నిర్వాహకుల ఆహ్వానం మేరకు ప్రసన్న కూచిపూడి నాట్య శాల చిన్నారులు సాంప్రదాయ వస్త్రధారణతో కూచిపూడి నృత్యాన్ని నయన మనోహరంగా ప్రదర్శించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు అమ్మవారి ప్రసాదం,జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా నృత్య కళాకారిణి అందుకూరి విశ్వనాథ శాస్త్రి ప్రసన్న దంపతులను ఆలయం తరపున నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. చిన్నారులలో దాగి ఉన్న నృత్య కళా ప్రతిభను వెలికి తీసిన కూచిపూడి నృత్య కళాకారిణి ప్రసన్నను ప్రత్యేకంగా అభినందించారు.

## పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులను అభినందించిన బిజెపి నేత అందె బాబయ్య ముదిరాజ్

✍ జయభేరి, షాద్ నగర్, డిసెంబర్ 12 :




పంచాయతీ ఎన్నికల్లో సర్పంచులుగా, ఉప సర్పంచ్, వార్డు మెంబర్ లుగా విజేతగా నిలిచిన ముదిరాజ్ సోదరీ సోదరీమణులకు నాయకులకు షాద్ నగర్ ముదిరాజ్ సంఘం తరఫున ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా అందె బాబయ్య మాట్లాడుతూ; పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రతి ఒక్క నాయకుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేసి గొప్ప పేరు ప్రతిష్టలు పొందాలని అన్నారు.
ప్రజలకు అవసరాలకు అనుగుణంగా అన్ని అభివృద్ధి పనులు చేయాలని అన్నారు. ఉన్నతమైన పరిపాలన విధానాన్ని అనుసరించి నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం షాద్ నగర్ తాలూకా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మంగ వెంకటేష్ ముదిరాజ్, తాలూకా యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ ముదిరాజ్, ఉపాధ్యక్షులు మంగ అశోక్ ముదిరాజ్, టౌన్ కార్యవర్గ సభ్యులు పద్మ కృష్ణయ్య ముదిరాజ్, సభ్యులు మేకల వెంకటేష్ ముదిరాజ్, పిట్టల అంజయ్య ముదిరాజ్, కోశాధికారి కొండే యాదయ్య ముదిరాజ్, మంగ మధు ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో జనరల్ స్థానాలులలో బీసీ అభ్యర్థిని గెలిపించండి

✍ జయభేరి, దేవరకొండ :





దేవరకొండ సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ పిలుపు స్థానిక దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గ కమిటీ సమావేశం ఏర్పాటు చేసినారు.
ఈ సమావేశంలో బీసీ సభ్యులందరూ కలిసి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ తీర్మానంలో నియోజకవర్గంలో ఉన్నటువంటి జనరల్ స్థానాలలో బిసి సర్పంచ్,వార్డ్ మెంబర్ అభ్యర్థులను రాజకీయ పార్టీలకు అతీతంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.మాకు ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ సోదరులు కూడా మద్దతు పలకాలని కోరారు స్థానిక సంస్థల్లో గెలుపే ధ్యేయంగా గ్రామాల్లో ఉన్నటువంటి బీసీ వర్గాలు మేధావులు, కళాకారులు, విద్యావంతులు అందరూ ఐక్యతతో పనిచేసి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి అన్నారు.మన బలం, ఐక్యత చూపి అత్యధిక స్థానాలు గెలుపు దిశగా మన ఐక్యత చాటాలని కోరారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ చొల్లేటి భాస్కరాచారి,రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత,పెరికేటి శ్రీనివాస్ చారి, భీమగోని శివ గౌడ్, రెడ్డి యాదయ్య, జక్కల ఆంజనేయులు, బొమ్మిడి వెంకటయ్యతదితరులు పాల్గొన్నారు.



## మాటల మాంత్రికుడు స్టైల్ మార్చాడా?

తన మాటలతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసిన రచయిత త్రివిక్రమ్ శ్రీనివాస్. ఆయన మాటల వల్లే ఆడిన సినిమాలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం దర్శకుడిగా కూడా విభిన్నమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నారాయన. నిజానికి 'గుంటూరు కారం' తర్వాత ఓ భారీ పౌరాణిక చిత్రానికి రంగం సిద్ధం చేసుకున్నారు త్రివిక్రమ్. కార్తికేయ పురాణం ఆధారంగా ఆయన రూపొందించే ఈ సినిమాలో కార్తికేయుడిగా ఎన్టీఆర్ కనిపిస్తారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే.. అప్పటికే ఎన్టీఆర్‌కు ఉన్న కమిట్‌మెంట్స్ కారణంగా ఈ సినిమాకు ప్రస్తుతానికి బ్రేక్ పడింది. దాంతో త్రివిక్రమ్ మరో కథను రెడీ చేసి, వెంకటేశ్‌తో 'ఆదర్శకుటుంబం' సినిమాను ప్రకటించారు. 'ఏకే 47' అనేది ఉపశీర్షిక. టైటిల్ ఫాంట్‌లో ఆయన ఇచ్చిన బ్లడ్ కలర్ సినిమా జానర్‌ని ప్రజెంట్ చేస్తున్నది. ఇప్పటివరకూ త్రివిక్రమ్ థ్రిల్లర్ సినిమాల జోలికి పోలేదు. అలాంటి ఆయన టైటిల్‌లో రక్తపు మరకలు కనిపించడం ప్రస్తుతం ఫిల్మ్ సర్కిల్స్‌లో చర్చనీయాంశమైంది. కెరీర్‌లోనే తొలిసారిగా ఓ ఫ్యామిలీ థ్రిల్లర్‌ని త్రివిక్రమ్ రాశారని వినికిడి. ఎప్పుడూ సరదా సినిమాలతో సందడి చేసే త్రివిక్రమ్ థ్రిల్లర్ చేస్తే ఎలా ఉంటుందో చూడాలని ఆయన అభిమానులు కూడా ఆశిస్తున్నారు. మరి ఆ ముచ్చట ఎలా ఉంటుందో చూడాలి.

## రాజాసాబ్ ట్రీట్ ఆన్ ది వే



పానిండియా సూపర్‌స్టార్ ప్రభాస్ 'ది రాజాసాబ్' సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానున్న విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్‌ను మేకర్స్ కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ఇందులో భాగంగా చిత్ర దర్శకుడు మారుతి రీసెంట్‌గా ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ 'రాజాసాబ్ రిలీజ్‌కు ముందు రాజాసాబ్ ప్రపంచంలోకి మీ అందర్నీ తీసుకెళ్లబోతున్నాం. రాజాసాబ్ ప్రయాణాన్ని ఇందులో ఆవిష్కరించనున్నాం. అసలు ఈ ప్రపంచ సృష్టి ఎలా జరిగింది?.. దీని వెనుక ఉన్న కష్టం ఏంటి?.. ఈ సినిమా వీఎఫ్ఎక్స్ పనుల్లో ఏం జరిగింది? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా ఈ వీడియో ఉంటుంది. ఈ ట్రీట్‌ని త్వరలోనే మీ ముందుకు తీసుకురాబోతున్నాం. 'ది రాజాసాబ్ ట్రీట్ ఆన్ ది వే..' అని మారుతి చెప్పుకొచ్చారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పళని, సంగీతం: ఎస్.తమన్, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, నిర్మాణం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ.

## కమిట్‌మెంట్ ఇవ్వలేదని 30 సినిమాల్లో నుంచి తీసేశారు..



సాధారణంగా సినీరంగంలో కాస్టింగ్ కౌచ్ అనేది పెద్ద సమస్య అన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా హీరోయిన్స్ చాలా మంది ఈ విషయంపై ఇప్పటికే పలు విషయాలు పంచుకున్నారు.
కెరీర్ తొలినాళ్లల్లో తమకు ఎదురైన చేదు అనుభవాలను బయటపెడుతుంటారు. అప్పట్లో ఇండస్ట్రీని ఊపేసిన ఈ హీరోయిన్.. సినిమాల్లోకి రాకముందు ఎన్నో కష్టాలు పడింది. అలాగే విమర్శలు, అవమానాలు భరించి.. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కానీ కెరీర్ మొదట్లో కమిట్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల 30 సినిమాల్లో నటించే అవకాశాన్ని కోల్పోయానని తెలిపింది.
కెరీర్ మొదట్లో అవకాశాల పేరుతో తనను ప్రైవేట్ పార్టీలకు ఆహ్వానించారని తెలిపింది. కానీ తనకు ఇష్టం లేకపోవడంతో ఆ పార్టీలకు వెళ్లలేదని.. దీంతో తనను 20 నుంచి 30 సినిమాల వరకు తీసేశారని.. తొలినాళ్లలో సినిమాల్లో నటించే అవకాశాన్ని కోల్పోయానని తెలిపింది. ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ మల్లికా షెరావత్. మర్డర్ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన మల్లికా షెరావత్ తన బోల్డ్ సన్నివేశాలతో రాత్రికి రాత్రే స్టార్ అయ్యింది. దీంతో ఆమెకు సినిమాలో అవకాశం ఇవ్వడానికి చాలా మంది నిర్మాతలు క్యూ కట్టారు. సినిమాలో నటించే అవకాశం కావాలంటే నైట్ పార్టీలకు వచ్చి వారితో రాజీ పడాల్సిందేనని.. కమిట్‌మెంట్ ఇవ్వాల్సిందేనని అన్నారని గతంలో ఓ ఇంటర్వ్యూలో బయటపెట్టింది మల్లికా. అలా పార్టీలకు వెళ్లకపోవడంతో తనను సినిమాల నుంచి తొలగించారని తెలిపింది.
కమిట్‌మెంట్‌ను తిరస్కరించడం వల్లే నాకు దాదాపు 30 సినిమాల ఆఫర్లు పోయాయని మల్లికా షెరావత్ అన్నారు. ప్రస్తుతం మల్లికా చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి. చాలా సంవత్సరాల తర్వాత ఈ బ్యూటీ ఇటీవలే రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే.

## బాలయ్య కూతురిగా ఈ అమ్మాయి..



నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్ లో రూపొందించిన సినిమా అఖండ 2. ఈ చిత్రానికి ముందు నుంచి భారీ హైప్ ఉన్న సంగతి తెలిసిందే. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి అద్భుతమైన బీజీఎమ్ అందించారు. ఈ సినిమాలో బాలయ్య కూతురిగా అందరి దృష్టిని ఆకర్షించింది ఓ అమ్మాయి. అఖండ 2 చిత్రంలో బాలయ్య కూతురు జనని అందరి దృష్టిని ఆకర్షించిన అమ్మాయి ఎవరో తెలుసా.. ? ఆమె ఒకప్పుడు ఫేమస్ చైల్డ్ ఆర్టిస్ట్. ఈ అమ్మడు పేరు హర్షాలీ మల్హోత్రా. నిజానికి ఈ సినిమా బాలకృష్ణ కూతురు జనని పాత్ర చుట్టే తిరుగుతుంది. ఆమె ఆపదలో ఉంటే రక్షించడానికి వస్తాడు. ఆమె పాత్ర సినిమాలో ప్రధానం. అఖండ 2 సినిమాతో హర్షాలీ తెలుగులో ఒక్కసారిగా పాపులర్ అయ్యింది. దీంతో ఇప్పుడు ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి తెగ సెర్చ్ చేస్తున్నారు నెటిజన్స్. ఇంతకీ ఈ అమ్మాయి ఎవరో తెలుసుకుందామా. ఈ అమ్మడు హిందీలో పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన భజరంగీ భాయిజాన్ చిత్రంలో నటించింది. అప్పుడు ఆమె వయసు కేవలం 6 సంవత్సరాలు. ఇందులో మున్ని అనే అమ్మాయి పాత్రలో నటించి అందరి మనసులు దోచుకుంది. ఇప్పుడు అఖండ 2 చిత్రంలో నటించింది. హర్షాలీ 2008 జూన్ 3న ముంబైలో జన్మించింది. భజరంగీ భాయిజాన్ తర్వాత కుబూల్ హై, లౌట్ ఆవో త్రిష వంటి సీరియల్స్ చేసింది. ఇప్పుడు 16 ఏళ్ల వయసులో అఖండ 2 సినిమాతో వెండితెరపైకి తెరంగేట్రం చేసింది. ప్రస్తుతం హర్షాలీ ఫోటోస్ నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

## అత్యంత దారుణంగా నటి పాకీజా పరిస్థితి.. వృద్ధాశ్రమంలో చేరి..



90వ దశకంలో తెలుగు ప్రేక్షకులను తన కామెడీతో అలరించిన నటి పాకీజా గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు. ఆమె అసలు పేరు వాసుకి . ఈ సీనియర్ నటి, 'అసెంబ్లీ రౌడీ' సినిమాలోని పాకీజా పాత్రతో విపరీతమైన గుర్తింపు సంపాదించుకుని అదే పేరుతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఒకప్పుడు తెలుగు సినిమాల్లో కమెడియన్‌గా ఓ వెలుగు వెలిగిన ఆమె, నేడు దయనీయ పరిస్థితుల్లో వృద్ధాశ్రమాన్ని ఆశ్రయించాల్సిన స్థితికి చేరుకున్నారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో వాసుకి ప్రస్తుతం ఆశ్రయం పొందుతున్నారు. సినీ ఇండస్ట్రీకి దూరమైన తర్వాత ఆమె ఎన్నో ఆర్థిక, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నారు.
పూట గడవని పరిస్థితుల్లో భిక్షాటన చేయాల్సి వచ్చిందని ఆమె ఆవేదన వ్యక్తం చేసిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ కావడంతో, ఆమె దుర్భర జీవితం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీరామ వృద్ధాశ్రమం నిర్వాహకుడు జల్లి కేశవరావు ముందుకొచ్చి ఆమెకు ఆశ్రయం కల్పించారు. వాసుకి మాట్లాడుతూ.. తనను సినిమా ఇండస్ట్రీకి పరిచయం చేసిన గురువు మోహన్ బాబు కుటుంబానికి తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. తన పరిస్థితిని తెలుసుకున్న మోహన్ బాబు కుమారుడు మంచు విష్ణు తన కళ్లకు శస్త్రచికిత్స చేయించారని చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఆయన సోదరులు చిరంజీవి, నాగబాబు కలిసి రూ.4 లక్షల ఆర్థిక సాయం అందించారని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ కూడా తనకు సహాయం చేశారని, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వ సహాయం మరింత అవసరమని వాసుకి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆధార్ కార్డులో చిరునామా మార్పుకు వృద్ధాశ్రమ నిర్వాహకులు సహకరించారని, ప్రభుత్వం నుంచి పింఛను, బియ్యం కార్డు మంజూరైతే తన జీవితానికి పెద్ద ఆధారంగా ఉంటుందని కోరారు. ఆశ్రమంలో ఉన్న తోటి వృద్ధులకు తన వంతు సేవ చేస్తూ రోజులు గడుపుతున్నానని, ఇక్కడికి వచ్చినప్పుడు తన ఆరోగ్యం బాగా క్షీణించిందని, ఇప్పుడు క్రమంగా మెరుగుపడుతోందని చెప్పారు. తెలుగు ప్రేక్షకులు ఇచ్చిన ఆదరణ, ఆప్యాయతలు ఎప్పటికీ మరువలేనివని ఆమె పేర్కొన్నారు.తమిళనాడుకు చెందిన వాసుకి 1991లో మోహన్ బాబు నటించిన 'అసెంబ్లీ రౌడీ' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు. ఆ తర్వాత 'మేజర్ చంద్రకాంత్', 'పెదరాయుడు', 'రౌడీగారి పెళ్లాం', 'బ్రహ్మ', 'పుణ్యభూమి నాదేశం' వంటి పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారు. ఒకప్పుడు వెండితెరపై నవ్వులు పూయించిన ఈ నటి ప్రస్తుత పరిస్థితి తెలుసుకుని సినీ అభిమానులు తీవ్రంగా బాధపడుతున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**